నిరసనల వెల్లువ

- పహల్గాం ఘటనపై రాజకీయాలకు అతీతంగా ఆందోళన
- పలు ప్రాంతాల్లో ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు
- మృతులకు సంతాపం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్


సమావేశంలో పాల్గొన్న పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు

నాంపల్లి: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం దారుణమని ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్(ఎఫ్‌టీసీసీఐ)లో నిర్వహించిన సమావేశంలో ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు డాక్టర్ సురేష్‌కుమార్ సింఘాల్ మాట్లాడుతూ... ఈ దాడి మన దేశ అభివృద్ధిపై జరిగిన దాడిగా భావించాలన్నారు. ఐదు ట్రిలియన్ల ఆర్థిక లక్ష్యాన్ని దెబ్బతీయాలనే కుట్ర జరిగిందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం తీసుకునే అన్ని చర్యలకు తాము పూర్తి మద్దతు ఇస్తామన్నారు. తెలంగాణ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ (టీఐఎఫ్) అధ్యక్షుడు కె.సుధీర్ రెడ్డి మాట్లాడుతూ భయాన్ని, అస్థిరతను సృష్టించేందుకే ఈ దాడి చేశారన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ మాజీ అధ్యక్షులు అనీల్ అగర్వాల్, శేఖర్ అగర్వాల్, జీఎస్‌టీ కస్టమ్స్ కమిటీ చైర్మన్ మహ్మద్ ఇర్షాద్ అహ్మద్, జీడిమెట్ల పరిశ్రమల సంఘం మాజీ అధ్యక్షుడు పి.కృష్ణ, క్రెడాయ్ ప్రతినిధి మనోజ్ కుమార్ అగర్వాల్, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

నల్లబ్యాడ్జిలతో ప్రార్థనలు


గోల్కొండ ఈద్గా ఖతీబ్‌కు నల్లబ్యాడ్జీలు కడుతున్న దృశ్యం

గోల్కొండ: ఇస్లాం మతంలో హింసకు తావు లేదని ఆల్ ఇండియా కీరత్ కమిటీ అధ్యక్షుడు, గోల్కొండ కుతుబ్‌షాహీ ఈద్గా ఖతీబ్ మౌలానా కారీ సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రి అన్నారు. పహల్గాం వద్ద పాక్ ఉగ్రవాదులు పర్యాటకులను కాల్చి చంపడాన్ని నిరసిస్తూ మజ్లిస్ పిలుపు మేరకు శుక్రవారం ఆయన నల్ల బ్యాడ్జీలు ధరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇస్లాంలో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించే వారికి స్థానం లేదని పాకిస్థాన్ మరోసారి తాను ఉగ్రవాద దేశంగా స్వయంగా నిరూపించుకుందన్నారు. ఖురాన్‌లో ఎక్కడా కూడా తీవ్రవాదంతో పాటు ఉగ్రవాదానికి తావేలేదన్నారు. టెర్రరిస్టులకు మన దేశం గట్టి జవాబు చెప్పాలన్నారు. శుక్రవారం కార్వాన్, మెహిదీపట్నం, అహ్మద్‌నగర్, గోల్కొండ తదితర ప్రాంతాలలోని మసీదులకు ప్రత్యేక ప్రార్థనలకు నల్లబ్యాడ్జీలు ధరించి వచ్చారు.



విష జ్వరాలపై అవగాహన ర్యాలీ


అవగాహన ర్యాలీలో పాల్గొన్న అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ సతీష్ రెడ్డి

చాంద్రాయణగుట్ట: ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అందులో భాగంగా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–10 అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ ఎం.సతీష్ రెడ్డి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఫలక్‌నుమాలో మలేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సతీష్ రెడ్డి మాట్లాడుతూ...ప్రజలు మలేరియా, డెంగ్యూ తదితర విష జ్వరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలలో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు లాంటివి లేకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒకసారి డ్రై డే గా పాటించినట్లయితే విష జ్వరాలకు చెక్ పెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. మలేరియా విభాగం సిబ్బంది ఎప్పటికప్పుడు బస్తీలలో పర్యటిస్తూ యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తున్నారన్నారు. ఎంటమాలజీ సిబ్బందికి ప్రజలు కూడా సహకరించాలన్నారు. కార్యక్రమంలో తీగలకుంట పిన్ సులోచన, సూపర్‌వైజర్లు పి.అరుణ్‌కుమార్, ఎస్.రాజేష్ నాయక్, ఎస్.రాజేందర్, వి.మోతిలాల్, రాజేశ్వర్ నాయక్, వికాస్, దామోదర్, ఎన్.మహేష్, ఎస్.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై పోరులో ముందుంటాం



కోఠి బ్యాంక్‌స్ట్రీట్‌లో బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నిరసన ప్రదర్శన

సుల్తాన్‌బజార్: ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో దేశానికి అండగా నిలుస్తామని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బీఎస్.రాంబాబు అన్నారురు. పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి బ్యాంక్ ఉద్యోగులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ దాడిని ఖండిస్తూ శుక్రవారం కోఠి బ్యాంక్‌స్ట్రీట్‌లో ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ, నిరసన ప్రదర్శన చేపట్టారు. వందలాది మంది బ్యాంక్ ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ..... ఉగ్రవాద దాడి బ్యాంకింగ్ వర్గాలకు తీవ్ర దుఃఖాన్ని, ఆగ్రహాన్ని కలిగించిందన్నారు. ఈ దాడిలో ఇద్దరు బ్యాంక్ ఉద్యోగులు జె.చంద్రమౌళి, శైలేష్ బాయ్ బలికావడం తమను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇందుకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు టి.రవీంద్రనాథ్, సంయుక్త కార్యదర్శి పీవీ.కృష్ణారావు, ఉప ప్రధాన కార్యదర్శులు సమద్‌ఖాన్, ఉదయ్ భాస్కర్, అజయ్ కుమార్, పెద్ద సంఖ్యలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..



గౌలిపురా: పహల్గాం ప్రాంతంలో ముష్కరుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ పాతబస్తీ చార్మినార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం లాల్‌దర్వాజా నెహ్రూ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్ల కార్డులను పట్టుకొని ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ... ఈ దారుణ ఘటనలో అమాయకులైన 28 మంది ప్రాణాలు కోల్పోవడంత బాధకరమన్నారు. కార్యక్రమంలో చార్మినార్, యాకుత్‌పురా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ముజీబ్ ఉల్లా షరీఫ్, కె.రవిరాజ్, కాంగ్రెస్ సేవాదళ్ నగర అధ్యక్షులు మూసా ఖాసిం, సీనియర్ నాయకులు సురేశ్ బాబు, తిరుపతి చంద్రశేఖర్, జి.శ్రీనివాస్, డల్లు శివ, దినేశ్ బిడ్లా, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మక్కా మసీదులో ముస్లింల నిరసన



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలకు పెద్ద ఎత్తున హాజరైన ముస్లింలు ప్రార్థనల అనంతరం పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పెద్ద సంఖ్యలో రోడ్డుపై వచ్చి పాకిస్థాన్ ముర్దాబాద్... పాకిస్థాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. భారతీయులపై దాడి చేసిన ఉగ్రవాదులను మట్టుబెట్టాలని కేంద్ర ప్రభుత్వానికి కోరారు. మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పిలుపు మేరకు ముస్లింలందరూ నల్ల బ్యాడ్జిలను ధరించి నిరసనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పత్తర్‌గట్టి కార్పొరేటర్ మహ్మద్ సోహేల్ ఖాద్రీతో పాటు మాజీ కార్పొరేటర్లు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దక్షిణ మండలం పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు చేపట్టారు.

కాలేజీ హాస్టళ్ల వర్కర్లకు ప్రతి నెల జీతాలు చెల్లించాలి


బీసీ సంక్షేమ భవన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, నీల వెంకటేష్ తదితరులు

విజయనగర్‌కాలనీ: కాలేజీ హాస్టళ్లలో పనిచేస్తున్న వర్కర్లు వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొన్ని జిల్లాల్లో గత 10 నెలలుగా జీతాలు అందడం లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం బీసీ సంఘం నాయకులు నీల వెంకటేష్ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్ దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్ వద్ద కళాశాల హాస్టల్ వర్కర్లతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఏడాదితగా జీతాలు అందకపోవడంతో రోజువారి ఖర్చులకు డబ్బులు మిత్తికి తీసువచ్చి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వర్కర్ల జీతాలు రూ.15 వేల నుంచి 25 వేలకు పెంచడంతో పాటు ఔట్‌సోర్సింగ్ విధానాన్ని ఎత్తివేసి ప్రభుత్వ ఖజానా నుండి నేరుగా వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. బీసీ హాస్టళ్లలో వర్కర్లను శాశ్వత ప్రతిపదికన నియమించాలన్నారు. ప్రతి హాస్టల్‌కు అటెండర్, వాచ్‌మెన్, కామాటి, కుక్‌లను శాశ్వత ప్రాతిపదికన నియమించాలన్నారు. నాలుగేళ్లుగా పనిచేస్తున్నవారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్లో 150 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్న చోట ప్రతి 25 మందికి ఒక వర్కర్‌ను అదనంగా కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించాలన్నారు. ప్రస్తుతం 300 మంది విద్యార్థులకు కేవలం ముగ్గురు వర్కర్లే ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు మంచి భోజనం, వసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కళాశాల వర్కర్ల సంఘం అధ్యక్షులు ఎం.శేఖర్, ప్రభాకర్, గొరిగె మల్లేష్, జిల్లపల్లి అంజి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలి


విజేతకు ప్రశంసా పత్రం అందజేస్తున్న నిర్వాహకులు

చార్మినార్: విద్యార్థులు తమ విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ డాక్టర్ సమద్ ఉస్మానీ అన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు పాత బస్తీ ఉర్దూఘర్‌లో జరిగిన అండర్–16 ఓపెన్ రౌండ్ రాబిన్ చెస్ టోర్నమెంట్–2025లో మహ్మద్ షబ్బీర్ అహ్మద్ విజేతగా నిలిచారు. శుక్రవారం విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. రెండో విజేతగా ఖాలెద్ బిన్ యాయా, మూడో విజేతలుగా మహ్మద్ సాహిర్ అహ్మద్, షేక్ ఆఫ్రీదీలకు నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు విద్యాభ్యాసంతో పాటు చెస్ తదితర ఆటల్లో రాణించడానికి ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రటరి సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ, డైరెక్టర్ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి

చాంద్రాయణగుట్ట: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఉప్పుగూడలో బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..... రాష్ట్ర సాధనలో ఉద్యమ పార్టీ టీఆర్‌ఎస్ పాత్ర ఎంతో ఉందన్నారు. 14 ఏళ్ల పాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజీలేని పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లేష్ యాదవ్, గడుసు సాయిలు పాల్గొన్నారు.

రమణీయం సృజన కూచిపూడి నృత్య విన్యాసం



గన్‌ఫౌండ్రీ: దీపాంజలి కూచిపూడి శిక్షణ నిలయం ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు దీపికారెడ్డి, శిష్యురాలు వంక సృజన కూచిపూడి నాట్య రంగప్రవేశం శుక్రవారం రవీంద్రభారతిలో కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా చక్కని తల్లికి, శివ, భవ భవ శరణం, భైరవి, జయ భైరవి, థిల్లాన, మంగళం రామచంద్రాయ, గణేష పంచరత్నం తదితర అంశాలపై చక్కటి హావభావాలో సాగిన నృత్యప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది.

ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ రఘురామ్ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీత కళలను నేటి తరానికి నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్‌గా పనిచేస్తూ కూచిపూడి నాట్య రంగప్రవేశం చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ పిజే నారాయణ్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ అరుణ భిక్షు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత దీపికా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెర్రరిజాన్ని తుదముట్టించాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

అఫ్జల్‌గంజ్: ప్రపంచ వ్యాప్తంగా టెర్రరిజాన్ని తుదముట్టించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. పహల్గామ్‌లో ఉగ్రదాడి పరికిపంద చర్యఅని, ఒక వర్గాన్ని టార్గెట్ చేసి హతమార్చడం బాధాకరమన్నారు. శుక్రవారం ఉస్మాన్‌గంజ్‌లోని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీ టెర్రరిస్టులను తుద ముట్టించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

అన్నదానం పోస్టర్ ఆవిష్కరణ

అనంతరం బాస్ అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మెడిశెట్టి రాకేష్, కోశాధికారి అనిల్ నాయర్, శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య, నిత్య అన్న సత్రం ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా బద్రినాథ్‌లో అన్నప్రసాద వితరణకు సంబంధించి పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మే 15 నుంచి 26 వరకు జరుగనున్న పుష్కారాలలో అన్నదానం చేపట్టడం అభినందనీయమన్నారు. ఏటా శబరిమల అయ్యప్ప భక్తులకు అన్నదానం చేస్తున్నారని, తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి ఆశ్రమం నిర్వహిస్తున్న భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి నాయకులను ఎమ్మెల్యే అభినందించారు. సేవా కార్యక్రమాలకు దాతలు చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో బాస్ ప్రతినిధులు ఎస్.జగదీష్ గుప్తా, విజయ్ భాస్కర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉత్తమ ఫలితాలు



విద్యార్థినులతో బీజేఆర్ ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవి

గోల్కొండ: క్రమ శిక్షణతో చదివితే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చునని గోల్కొండ బీజేఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవి అన్నారు. ఇంటర్ ఫలితాల్లో కళాశాల టాపర్స్‌ను శుక్రవారం ఆమె ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో మంచి ఫలితాలు వచ్చాయని, మంచి మార్కులు స్కోర్ చేసి విద్యార్థినులు తమ కళాశాలకే గర్వకారణంగా నిలిచారన్నారు. అత్యుత్తమ ఫలితాల వెనుక అధ్యాపకుల పాత్ర ఎంతగానో ఉందన్నారు. నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థినులే తమ కళాశాలలో ఎక్కువగా ఉన్నారని, భవిష్యత్తులోనూ అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా చదవాలని సూచించారు. ఎంపీసీలో ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థిని నజ్రా ఫాతిమా(976), సాధియాబేగం(969)మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం


వరంగల్ సభకు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్‌రెడ్డి తదితరులు

గోల్కొండ: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ఆదరణ పెరుగుతుందని కాంగ్రెస్ అసమర్థ పాలన ఇందుకు కారణమని బీఆర్‌ఎస్ నాయకుడు కె.శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన లక్ష్మీనగర్ చౌరస్తా బీఆర్‌ఎస్ కార్యాలయం నుంచి వరంగల్‌లో జరగనున్న బీఆర్‌ఎస్ మహాసభలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికి తెలుసు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రజలకు హామీలు, వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని, 17 నెలలు గడుస్తున్నా హామీలు నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి భారీ అవినీతికి తెరలేపారని తెలంగాణ ప్రజలు దీనిని సహించరన్నారు. తెలంగాణలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు జరిగినా భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు కోడూరి శ్రీధర్‌సాగర్, శ్రీనివాస్‌గుప్తా, విజయ్, వసంత, రుక్మిణి, రాజమ్మ తదితరులున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ గ్యాన్‌బాగ్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని గ్యాన్‌బాగ్ కాలనీ, నయాబస్తీ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఫైర్‌స్టేషన్ ఫీడర్ పరిధిలోని గురుద్వారా లైన్, అమృత్‌బార్ లైన్ తదితర ప్రాంతాల్లో 8.30 గంటల నుండి 9.00 గంటల వరకు, ఎంజే మార్కెట్ ఫీడర్ పరిధిలోని కరాచి బేకరి, రిజిస్టర్ కార్యాలయం, పోస్టాఫీస్ లైన్, మాలకుంట తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుండి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రహీంపురా, సీతారామ్‌పేట్ ఫీడర్ల పరిధిలోని రహీంపురా, ఖాజాగూడ, రహీంపురా సీటీఐ క్వార్టర్స్ సీతారామ్‌పేట్, నమాజ్ గ్రౌండ్, ఆగాపురా, నాంపల్లి, న్యూ బోయిగూడ, ఐస్ ఫ్యాక్టరీ, రామ్‌లీలా గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో 9.30 గంటల నుండి 10 గంటల వరకు, గండి హనుమాన్ ఫీడర్ పరిధిలోని మల్లెమెట్, మహబూబ్ కాలనీ, నట్రాజ్‌నగర్, ఐస్ ఫ్యాక్టరీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుండి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు వివరించారు.

సిటీ కాలేజీలో ముగిసిన నిపుణుల సదస్సు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న వాణిజ్య పరభాషా నిఘంటువు (ఇంగ్లీష్–హిందీ–తెలుగు) నిపుణుల సమావేశం శుక్రవారం ముగిసింది. ఈనెల 21న ప్రారంభమైన ఈ సమావేశం కేంద్ర ప్రభుత్వం, విద్యాశాఖకు చెందిన కేంద్ర శాస్త్రీయ, సాంకేతిక పద బంధాల సంస్థ సహకారంతో నిర్వహించారు. వాణిజ్య శాస్త్రం, తెలుగు భాషా రంగాలకు చెందిన పలువురు నిపుణులు వాణిజ్య శాస్త్ర విభాగానికి చెందిన 3,835 సాంకేతిక పదాలకు తెలుగు సమానార్థకాలను అభివృద్ధి చేయడంలో కృషి చేశారు. కమిటీలో ప్రొఫెసర్ రవి ఆకుల, ప్రొఫెసర్ ఎస్. కవితా దేవి, ప్రొఫెసర్ రవీంద్రనాథ్ సోలమన్, డా. ఎన్. సురేష్, డా. ఎస్. ఝాన్సీ రాణి కామర్స్ నిపుణులుగా పాల్గొన్నారు. డా.జె. నీరజ, డా.కోయి కోటేశ్వరరావు తెలుగు నిపుణులుగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి వాణిజ్య విభాగ అధ్యక్షులు డా. మల్లికార్జున రావు, కన్వీనర్‌గా వ్యవహరించగా.. న్యూఢిల్లీ ప్రతినిధిగా, సమన్వయ కర్తగా డా.ఇందర్‌దీప్ సింగ్ వ్యవహరించారు.

సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి


విద్యార్థులతో పీస్ ఫోర్స్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్

గోల్కొండ: విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని పీస్ ఫోర్స్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో 10వ తరగతి, ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులతో మాట్లాడారు. ఎన్‌జీవోలు, ప్రైవేటు వ్యక్తులతో పాటు పలు సొసైటీలు విద్యార్థులకు ఉపయోగకరమైన కోర్సులను సమ్మర్ క్యాంపుల్లో అందిస్తున్నాయన్నారు. కంప్యూటర్, ల్యాబ్‌టెక్నీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, మెథమెటిక్స్ తదితర అంశాల్లో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారన్నారు. తమకు అభిరుచి గల సమ్మర్ క్యాంపుల కోర్సులలో చేరి సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యాకోర్సులకు వెళ్లే వారి కోసం ఇలాంటి సమ్మర్ క్యాంపులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో మహ్మద్ ఫహద్, అయూబ్, బాబర్, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులు నిబంధనలు పాటించాలి


హజ్ యాత్రికులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్


గోల్కొండ: హజ్ యాత్రికులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో హజ్ యాత్రకు ఎంపికైన వారికి జరుగుతున్న వాక్సినేషన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి వైద్యులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హజ్ యాత్రికులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్కానగరంతో పాటు మదీనాలో కూడా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన హజ్ యాత్రికులు ఉంటారన్నారు. పవిత్ర మసీదుల్లో కాలయాపన చేయకుండా తమవెంట ఉన్న హజ్ గైడ్ ఆదేశాలను, సూచనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. తమకు కేటాయించిన గ్రూప్ వారితోనే హజ్‌యాత్ర పూర్తయ్యే వరకు ఉండాలన్నారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, తమ వెంట తెచ్చుకున్న మందులను క్రమం తప్పకుండా వాడాలన్నారు. వాక్సినేషన్ శిబిరాన్ని విజమవంతంగా నిర్వహిస్తున్న ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.వి.శ్రీనివాసరావును అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ రాకేష్‌కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆబేద్ బాయ్, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభ విజయవంతం కావాలని పూజలు



జియాగూడ: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ సీనియర్ నాయకులు శేఖర్‌రెడ్డి, యాదశ్రీనివాస్ గుప్తా, శ్రీధర్ సాగర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జియాగూడ మహంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్యంతో ఉండాలని మాతేశ్వరీని ప్రార్థించామన్నారు. బహిరంగ సభకు కార్వాన్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు నరహరి చారి, ప్రధాన కార్యదర్శి సి.బాబు, అసెంబ్లీ యూత్ అధ్యక్షులు మంగి కిషోర్‌కుమార్, జడల మోహన్, రఘునాథ్, సంగీత, అరుణ, అనిత, ప్రకాష్, పాలెం వెంకటేష్, ఎం.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రెండు గుర్తు తెలియని మృతదేహాలు స్వాధీనం




సంతోష్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శివ ప్రసాద్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుల్షన్ ఇక్బాల్ కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో...

ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై బ్రహ్మాచారి తెలిపిన వివరాల ప్రకారం... ఐ.ఎస్.సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భోజిరెడ్డి కాలేజీ లేన్ వాణినగర్ సమీపంలో శుక్రవారం 40–45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన పెట్రోలింగ్ పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి



నాంపల్లి: కారు ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన సంఘటన మాసబ్‌ట్యాంక్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం తెల్లవారుజామున బంజారాహిల్స్ పెన్షన్ ఆఫీస్ సమీపంలో ఓ గుర్తు తెలియని యువకుడు రోడ్డుదాటుతున్నాడు. అదే సమయంలో బంజారాహిల్స్ నుంచి మాసబ్‌ట్యాంక్ వైపు వేగంగా వచ్చిన కారు అతడిని ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారకస్థితిలోకి చేరుకున్న అతడిని సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని షాలిబండకు చెందిన ఏజెంట్ మహ్మద్ సల్మాన్ ఫైజాన్‌గా గుర్తించి కేసును నమోదు చేశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. సంబంధీకులు మాసబ్‌ట్యాంక్ పోలీసులను లేదా 040–27853450, 8712661484 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.